# సినిమాకి పనికొచ్చే కథ

-మునిపల్లె లక్ష్మీరమణకుమారి

కాంతంకి ఈమధ్య దిగులు పట్టుకుంది. నిజానికి కాంతంది చీకూ చింతా లేని జీవితం. పల్లెలో రెండకరాల పొలం. హైదరాబాద్‌లో ఫ్లాట్. గవర్నమెంటు ఉద్యోగం, ఇద్దరు పిల్లలూ, అనుకూలమైన భార్య. ఇవన్నీ కాక అడపాదడపా కథలు రాసి కథకుడనే ఎక్స్‌ట్రా అట్రాక్షన్ అన్నీ ఉన్నాయి. కానీ ఉన్నదానితో సంతృప్తి పడిపోతే మనిషి మనిషే కాడు. ఎన్నటికీ ఎదగలేడు.

అందరికీ ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్‌లా కనబడే ఆ రచనలే కాంతంకి మనశ్శాంతి లేకుండా చేసేస్తున్నాయి. అతనికి ఈమధ్య అన్నం సహించడం లేదు. నిద్రపట్టడం లేదు.

'సినిమా రచయిత' అనిపించుకోవాలని కాంతంకి ఆరాటం మొదలైంది.

ఆ గ్లామర్ వేరు, ఆ పేరు వేరు, ఆ ఇదే వేరు.. సినిమాలకి రాయాలి. ఎలాగైనా సినీ రైటర్ అయిపోవాలి. ఎక్కడో ఎప్పుడో ఒక మహావ్యక్తి చెబుతుంటే విన్న ముక్కలు అతని మదిలో ఆనాడే చెరగని ముద్రవేశాయి. అవి రోజా తల్చుకుంటూనే ఉంటాడు.

"ఏరంగంలో అయినా పైకి రావాలనే ముందు వేడి పుట్టాలి. ఆ వేడిలోంచి ఒక తపన మొదలవ్వాలి. ఆ తపనలోంచి, ఆ మథనలోంచి ఒక గొప్ప కళ ఆవిష్కరించబడాలి"

తనలో వేడి పుట్టింది. ఒక తపన మొదలయ్యింది. కాబట్టి తప్పకుండా ఒక గొప్ప రచన, సినీరచన ఆవిష్కరించబడుతుంది. కానీ ఎలాగా?

అప్పట్నుంచే అన్ని ప్రయత్నాలూ మొదలుపెట్టాడు. అన్ని రాళ్ళూ విసిరాడు. ఒక్కటీ తగల్లేదు. నిరుత్సాహపడకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఈ ప్రయత్నంలోనే కొన్ని ఏళ్ళు గడచిపోయినా బాధపడలేదు. ఒక్క ఛాన్సు. ఒకే ఒక్క ఛాన్సు తనకి ఇస్తే చాలు. తనేమిటో నిరూపించుకుంటాడు. కానీ ఆ ఛాన్స్ ఇచ్చేందుకు ఎక్కడా ఎవ్వరూ సిద్ధంగా లేరు. సక్సెస్ ఉంటే తప్ప ఎవరూ పిలవరు. ఛాన్స్ ఇస్తేనే కదా సక్సెస్!

కాంతం తిరగ్గా, తిరగ్గా, తిరగ్గా అతనికి ఒక సంగతి తెలిసింది. ప్రసిద్ధ దర్శకుడు కనకారావు తన బావమరిదికి ఎక్కడో దూరపు బంధువుకి క్లాస్‌మేటట.

కాంతంకి తీగె దొరకింది కాబట్టి అల్లుకుపోయాడు. బావమరిదిని పట్టుకుని దూరపుబంధువు జాడ తెలుసుకుని ఆయన్ని తీసుకుని తిరిగి, తిరిగి ఎట్లాగో కనకారావుని కలుసుకోగలిగాడు.

కనకారావు ఫ్రెండ్లీగానే మాట్లాడాడు.

"ఎట్లాగైనా నాకు ఛాన్స్ ఇవ్వాలి సార్. ప్లీజ్ మీ మేలు మర్చిపోలేను" అని బ్రతిమిలాడాడు కాంతం.

"మీకు టాలెంట్ ఉంటే ఎంకరేజ్ చెయ్యడానికి నేను రెడీ" అన్నాడు కనకారావు.

"టాలెంటా? పుష్కలంగా ఉంది" అన్నాడు కాంతం.

"సినిమాల టాలెంట్ వేరు. మీ దగ్గర కథలేమేం ఉన్నాయి?" అడిగాడు కనకారావు.

కాంతం బట్టీపట్టిన పద్యంలా మూడుకథలు వినిపించాడు. కనకారావు అన్నీ విని చప్పరించేశాడు.

కాంతం తెల్లబోయాడు. మూడుకథలూ మూడు మాణిక్యాలలాంటివి. మరి కనకారావు ఇలా తీసి పారేశాడేంటి?

"ఇక నాకు టైం లేదు. వచ్చేవారం పదహారోతారీఖున సాయంత్రం ఐదింటికి రండి. మంచి ప్రేమ కథ రాసి పట్రండి. కథ విని ఊగిపోవాలి" అన్నాడు కనకారావు.

అంత గొప్పాయన తనకి అపాయింట్‌మెంట్ ఇవ్వడమే గొప్ప. కాంతం కుడికన్ను అదిరింది.

ఈసారి కథ తప్పకుండా ఒప్పుకుంటాడు ఆయన. ఆయనకి నమస్కారం పెట్టి సెలవు తీసుకుని ఇంటికి చేరాడు. ఆఫీసుకి సెలవు పారే అహోరాత్రులూ శ్రమపడి ఒక అద్భుత ప్రేమక సృష్టించాడు. పాపం కనకారావు షూటింగ్‌ల ఉన్నాడు. మధ్యలో కాస్సేపు గ్యాప్ దొరికితే వచ్చి కథ విన్నాడు. అంతా విన్నాక మళ్లీ చప్పరిం శాడు. కాంతంకి అంత నిరాశ జీవితంలో ఎన్నడు కలిగి ఉండలేదు పాపం. ఒక్కసారిగా కింద కూల డిపోయి ఏడ్చేద్దామనిపించింది.

"ఏంటిసార్. కథ బాగాలేదా?" అన్నాడ దాదాపు ఏడ్చేస్తూ.

కనకారావు కాంతం బాధని అర్థం చేసుక న్నాడు. సిగరెట్ దమ్ములాగి దీర్ఘంగా ఆలోచిం కాంతం వైపు చూశాడు.

"మీకు ఫీల్డ్ కొత్త. అందుకే ఎలాంటి ప్రెజం షన్ ఉండాలో మీకు అర్థంకాలేదు. కథకేముం ఎవ్వరైనా రాస్తారు. ప్రెజంట్ చెయ్యడమే ముఖ్యం" అన్నాడు.

"అంటే..నా కథ బాగుందా మరి?" ఆశగా అ గాడు కాంతం.

"చెప్పానుగా. కథదేముంది. దాన్ని మీర చక్కగా ప్రెజంట్ చేస్తేనే హిట్. లేకుంటే ఫట్"

హిట్టు ఫట్టుల సారాంశం అంతా అరటిపండు ఒల్చిపెట్టినట్టు అర్థమైపోయింది కాంతంకి.

"అదేదో ఎలా చెయ్యాలో మీరే చెప్పాలి సార్ మీరే నాకు గురువూ, దైవం" అన్నాడు ఆయనక సాష్టాంగపడి.

కనకరావు కాంతం రెక్కపట్టి లేపాడు.

"దానికేముంది. అలాగే బోధిస్తాను. సినిమా కథంటే మరేం లేదు. ఏ పాత్ర అయినాసరే శృంగారం ఒలికించేస్తుండాలి. కనీసం అండర్ కరెం ట్‌లాగా అయినాసరే ప్రతి పాత్రలో, ప్రతి సన్నివే శంలో శృంగారం ప్రవహింపచేయాలి" అన్నాడు.

కాంతం సందేహంగా చూశాడు.

"అదెలా సాధ్యంసార్. ముసలిపాత్రలు ఉంటాయి. వాటికి..." ఏదో చెప్పబోయాడు.

"వాటిల్లో కూడా శృంగారం ప్రవహించాలి"

"బాగుండదేమో. ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారా అసలు?"

"ఎందుకు చేసుకోరు? ఆ ఏజ్ గ్రూప్ వాళ్ళు ఐడెంటిఫై చేసుకుని ఆనందిస్తారు"

"కానీ.." కాంతం ఇంకా ఏదో అడగబో యాడు.

"ఇక కానీలూ, అర్థణాలూ చెప్పుకుంటూ కూర్చునే తీరిక నాకు లేదు. ఎలా రాసి పట్టుకొ స్తావో తెలీదు. నేను చెప్పిన విధంగా రాస్తేనే నీ కథ పట్టుకురా. నాకెక్కువ టైం ఉండదు. తెలుసుగా" అన్నాడు కనకారావు లేచి సెట్లోకి వెళ్తూ.

కాంతం లేచాడు. అతనికి ఏం చెయ్యాలో అర్థంకాలేదు. ఏది చేసి అయినాసరే మాంచి రసవ

త్తరమైన కథ రాయాలి. కానీ ఎలాగ? ప్రతిపాత్రలో శృంగారం ఎలా సృష్టించడం? ఆ విధంగా రాస్తేనే కనకారావు కథ వింటాడు. ఇది తనకు గోల్డెన్‌ఛాన్స్. పోతే తిరిగిరాదు. ఈసారి రాయలేకపోతే ఇక కనకారావు తన అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడు.

చలనం, చైతన్యం ఉండాలని సైకిలెక్కి, స్కూటరెక్కి, సిటీ బస్సులెక్కి, ఆటోలూ, టాక్సీలూ ఎక్కి తెగతిరిగాడు కాంతం. ఎంతోమందితో మాట్లాడాడు. కానీ ప్రతిపాత్రలో శృంగారం



ఎలా సృష్టించడమో అర్థమే కాలేదు. ఇక తనకు సినిమా కథ లేదు. కాంతం తెగ నీరసపడిపోయాడు. డిప్రెషన్, ఫ్రస్ట్రేషన్ వచ్చేశాయి. గడ్డం పెరిగింది. మనిషి చిక్కిపోయాడు. అంతా జాలిపడుతున్నారు. అట్లాంటి స్థితిలో అనుకోకుండా...

అతనికి సుబ్బనారాయణతో పరిచయం కలిగింది. సుబ్బనారాయణ అతని పక్కింట్లోకి కొత్తగా వచ్చి చేరాడు. పరిచయం చేసుకుని తనే చనువుగా స్నేహం పెంచుకున్నాడు. ఇద్దరూ సినిమాలకీ, హోటళ్లకీ తిరిగారు.

సుబ్బనారాయణతో పరిచయం కలగడం తన అదృష్టం అని కాంతంకి కొద్దిరోజుల్లోనే తెలిసిపోయింది. సుబ్బనారాయణది ఏం బతుకోగానీ అతనికి ఎందులోనైనా సరే శృంగారం తప్ప మరోటి కనిపించదు. ఇద్దరూ ఒకరోజు బజార్లో నడుస్తున్నారు. చిక్కిపోయి, కళ్ళు గుంటలు పడి, దీనంగా ఉన్న ఒక యువకుడు కనిపించాడు. అతని మొహంలో దిగులు చూసి కాంతంకి బాధ అనిపించింది. అతనిది దేనికైనా చలించిపోయే తత్వం కాబట్టి బాధపడి ఆ బాధని సుబ్బనారాయణతో చెప్పుకున్నాడు.

“ఆ.. దేనికండీ బాధపడతారు. వాడికి ఎవత్తో వస్తానని హ్యాండిచ్చి ఉంటుంది. అందుకే డిప్రెషన్‌తో చిక్కినట్టున్నాడు” అని చప్పరించేశాడు సుబ్బనారాయణ.

అదే రోడ్డుమీద ఒకరోజు ఒక గుర్రబ్బండి పోతోంది. ఈరోజుల్లో సిటీల్లో గుర్రం బండి చూడడం అరుదు. చూసినా ఆ గుర్రం నీరసంగా బండిలాగడమే కనిపిస్తుంది. కానీ ఈ గుర్రం మాత్రం అంత ట్రాఫిక్‌లోనూ హుషారుగా స్పీడ్‌గా బండిని లాగేస్తోంది. దాన్ని చూసి కాంతం ముచ్చటపడ్డాడు.

“ఆ.. దాని మొహాన కాస్త పోసి ఉంటారు. ఏ రమ్మో తాగి తన గర్ల్‌ఫ్రెండ్ గుర్రాన్ని కలుసుకుంటానేమోనని ఊహించుకుంటూ రన్ చేస్తోంది” అన్నాడు సుబ్బనారాయణ.

* * *

చిన్నపిల్లలు ఉత్సాహంగా ఉన్నా ముసలివాళ్ళు సంతోషంగా తిరుగుతున్నా కూడా సుబ్బనారాయణ అట్లాంటి పెడర్థాలే తీస్తాడు.

“తమ గర్ల్‌ఫ్రెండ్‌కో, బాయ్‌ఫ్రెండ్‌కో లెటర్ ఇవ్వడానికో, ఫోన్ కొట్టడానికో పోతున్నారు”

అడుక్కునే వాళ్లని చూసినా, హాస్పిటల్‌లో రోగిని చూసినా సుబ్బనారాయణకి జాలి కలగడు సరికదా. వాళ్లల్లో శృంగారం పొంగి పొర్లిపోతున్నట్లు అతనికి అనిపిస్తుంది. ఆఖరికి చీమని చూసినా అదే మాట అంటాడు. పిపీలకాది బ్రహ్మపర్యంతం...ఈ సృష్టి మొత్తంలో, కీటకాల్లో, పశుపక్ష్యాదుల్లో, సమస్త మానవకోటిలో ఎక్కడ చూసినా ఏది చూసినా ఎవర్ని చూసినా అతనికి శృంగారరసమే కనిపిస్తుంది. సృష్టిమొత్తం అందులోనే ఓలలాడుతుందనుకుంటాడు. బూతుజోక్‌లూ, శృంగార భావాలూ తప్ప అతనికి మరోకటి తెలియవు. ఇసుకలోంచి తైలాన్ని పిండి తీయగల సమర్థుడిలా ఎందులోనుంచి అయినా శృంగారాన్ని తీయగల సమర్థుడు అతను.

అతని మాటల మైకంలో, శృంగార భావవాహినిలో కాంతం మునిగి తేలిపోయి ఆఖరుకి తన సినిమా రచన కూడా మర్చిపోయాడు. సుబ్బనారాయణ మాటలు అంతగా అతడ్ని ప్రభావితం చేసేశాయి. హఠాత్తుగా ఒకరోజు బ్రాహ్మీముహూర్తంలో అతనికి తన సినిమా రచన గుర్తుకొచ్చింది. ఇప్పుడు సినిమా కథ రాయడానికి కావాల్సిన సత్తా తన దగ్గరుంది. వెంటనే కథ రాసి పారేశాడు.

కథ అతి రసవత్తరంగా సాగిపోయింది. ప్రతి సన్నివేశంలో సెక్స్ అంతర్లీనంగా ప్రవహించేసింది. ప్రతిపాత్రలో, అది ఏ వయసు పాత్ర అయినా సరే శృంగారం అద్భుతంగా ఒలికిపోయింది.

కనకారావు కథని వెంటనే ఒప్పేసుకున్నాడు. కాంతంకి తన కోరిక తీరినందుకు పట్టరాని ఆనందం కలిగింది. ఆనందం పట్టలేక ఎగిరి గంతేశాడు.

★